

# ఆశ్చర్యకరమైన యేసుక్రీస్తు జీవితం

ఉచితము—అమ్మబడదు

# ఆశ్చర్యకరమైన యేసుక్రీస్తు జీవితం

చాలా సంవత్సరాల క్రితం యేసు క్రీస్తు ప్రభువు వారు ఒక సాధారణమైన వ్యక్తిగా కాకుండ, ఖ్యాతి చెందిన వ్యక్తిగా జీవించి మృతిచెందెను. లేఖనాల ప్రకారం ఆయన సృష్టికర్తయైన దేవుడు, భూమి మీద మానవునిగా జీవించి మరణం నుండి, సాతాను యొద్ద నుండి, పాపములనుండి మానవ కోటిని విడిపించడానికి తన జీవితాన్ని, రక్తాన్ని ధారపోసెను. ఆయన యొద్దకు వచ్చు వారందరికి నిత్యజీవమును ఇచ్చుటకు ఈ రోజుల్లో కూడ సజీవముగా ఉన్నాడు. యేసు క్రీస్తుని అంగీకరించుట మరియు తిరస్కరించుట అనునది మరణించుట లేదా జీవించుటతో సమానం. దేవుని కుమారుని అంగీకరించువాడు జీవముగలవాడు. దేవుని కుమారుని అంగీకరింపనివాడు జీవము లేనివాడు(1యోహాను 5:12). మరి ఎవరివలన రక్షణకలుగదు, ఈ నామమందే మనము రక్షణ పొందవలెనుగాని, ఆకాశము క్రింద ఉన్న మనుష్యులలో ఇవ్వబడిన మరి ఏ నామమున రక్షణపొందలేము అనెను (అ.కా. 4:12)..

యేసు క్రీస్తు యొక్క ఆశ్చర్యకరమైన జీవితాన్ని గురించి చదువుచుండగా దేవుడు మీకు వాస్తవమైయుండును గాక! అద్వితీయ సత్యదేవుడైన నిన్నును, నీవు పంపిన యేసుక్రీస్తును ఎరుగుటయే నిత్యజీవము (యోహాను 17 3). యేసుక్రీస్తును నీ హృదయములో స్వంతరక్షకునిగా ప్రభువునిగా అంగీకరించావా? లేకపోతే ఈ రోజే క్రీస్తును సొంత రక్షకునిగా అంగీకరించు!

---

All scriptures are taken from the Telugu Bible with permission from the Bible Society of India.

# యేసుక్రీస్తు జన్మముకంటే ముందు ఉనికి కలిగిఉండుట

ఆదియందు వాక్యముండెను, వాక్యము దేవుని యొద్దఉండెను, వాక్యము దేవుడైయుండెను. ఆయన ఆదియందు దేవుని యొద్ద ఉండెను. సమస్తమును ఆయన మూలముగా కలిగెను. కలిగియున్నదేదియు ఆయన లేకుండ కలుగలేదు. ఆ వాక్యము శరీరధారియై కృపాసత్య సంపూర్ణుడుగా మన మధ్య నివసించెను!. (యోహాను 1:1–3,14)

ఏలయనగా ఆకాశమందున్నవియు, భూమియందున్నవియు, దృశ్యమైనవిగాని, అదృశ్యమైనవిగాని, అవి సింహాసనములైనను ప్రభుత్వములైనను ప్రధానులైనను అధికారములైనను, సర్వమును ఆయనయందు సృజింపబడెను, సర్వమును ఆయన ద్వారాను ఆయనను బట్టియు సృజింపబడెను. (కొలొస్స 1:16–17)

పూర్వకాలమందు నానాసమయములలోను నానావిధములుగాను ప్రవక్తల ద్వారా మన పితరులతో మాటలాడిన దేవుడు ఈదినముల అంతమందు కుమారుని ద్వారా మనతో మాటలాడెను. ఆయన ఆ కుమారుని సమస్తమునకును వారసునిగా నియమించెను. ఆయన ద్వారా ప్రపంచములను నిర్మించెను. (హెబ్రీ 1:1–2)

యేసు – అబ్రాహాము పుట్టకమునుపే నేను ఉన్నానని మీతో నిశ్చయముగా చెప్పుచున్నాననెను.

(యోహాను 8:58)

# యేసు క్రీస్తు జీవితమును గూర్చి ప్రవక్తలు ప్రవచించుట

కాబట్టి ప్రభువు తానే యొక సూచన మీకు చూపును. ఆలకించుడి. కన్యక గర్భవతియై కుమారునికని అతనికి ఇమ్మానుయేలను పేరుపెట్టును. (యెషయా 7:14)

బేత్లెహేము ఎఫ్రాతా, యూదా వారి కుటుంబములలో నీవు స్వల్ప గ్రామమైనను నా కొరకు ఇశ్రాయేలీయులను ఏలబోవువాడు నీలోనుండి వచ్చును; పురాతనకాలము మొదలుకొని శాశ్వతకాలము ఆయన ప్రత్యక్షమగుచుండెను. (మీకా 5:2)

ఏలయనగా మనకు శిశువు పుట్టెను మనకు కుమారుడు అనుగ్రహింపబడెను ఆయన భుజముమీద రాజ్యభారముండును. ఆశ్చర్యకరుడు ఆలోచనకర్త బలవంతుడైన దేవుడు నిత్యుడగు తండ్రి సమాధానకర్తయగు అధిపతి అని అతనికి పేరుపెట్టబడును. (యెషయా 9:6)

ఇది మొదలుకొని మితిలేకుండ వృద్ధియు క్షేమమును కలుగునట్లు సర్వకాలము దావీదు సింహాసనమును, రాజ్యమును నియమించును న్యాయమువలనను నీతివలనను రాజ్యమును స్థిరపరచుటకు అతడు సింహాసనాసీనుడై రాజ్యపరిపాలన చేయును. సైన్యములకధిపతియగు యెహోవా ఆసక్తిగలిగి దీనిని నెరవేర్చును. (యెషయా 9:7-9)

## యేసుక్రీస్తు పరలోకమును వదిలి మనుష్యునిగా వచ్చుట.

క్రీస్తుయేసునకు కలిగిన యీమనస్సు మీరును కలిగియుండుడి. ఆయన దేవుని స్వరూపము కలిగినవాడై యుండి, దేవునితో సమానముగా ఉండుట విడిచిపెట్టకూడని భాగ్యమని యెంచుకొనలేదు గాని మనుష్యుల పోలికగా పుట్టి, దాసుని స్వరూపమును ధరించుకొని, తన్ను తాను రిక్తునిగా చేసికొనెను. మరియు ఆయన ఆకారమందు మనుష్యుడుగా కనపడి, మరణము పొందునంతగా, అనగా సిలువ మరణము పొందునంతగా విధేయత చూపినవాడై, తన్ను తాను తగ్గించుకొనెను. (ఫిలిప్పీ 2: 5,8)

యేసు వారితో ఇట్లనెను – దేవుడు మీ తండ్రియైనయెడల మీరు నన్ను ప్రేమింతురు; నేను దేవునియొద్దనుండి బయలుదేరి వచ్చియున్నాను, నా అంతట నేనే వచ్చియుండలేదు, ఆయన నన్ను పంపెను. (యోహాను 8:42)

మొదటి మనుష్యుడు భూసంబంధియై మంటినుండి పుట్టినవాడు, రెండవ మనుష్యుడు పరలోకము నుండి వచ్చినవాడు. (1 కొరింథీ 15:47)

కాబట్టి ఆయన ఈ లోకమందు ప్రవేశించునప్పుడు ఈలాగు చెప్పుచున్నాడు. – బలియు అర్పణయు నీవు కోరలేదు గాని నాకొక శరీరమును అమర్చితివి. (హెబ్రీ 10:5)

# యేసు క్రీస్తు లోకానికి రావడానికి గల ఉద్దేశము

మనుష్యకుమారుడు పరిచారము చేయించుకొనుటకు రాలేదు గాని పరిచారము చేయుటకును, అనేకులకు ప్రతిగా విమోచన క్రయధనముగా తన ప్రాణము ఇచ్చుటకును వచ్చెననెను.
(మార్కు 10:45)

నశించినదానిని వెదకి రక్షించుటకు మనుష్యకుమారుడు వచ్చెనని అతనితో చెప్పెను.

(లూకా 19:10)

లోకము తన కుమారుని ద్వారా రక్షణ పొందుటకే గాని లోకమునకు తీర్పు తీర్చుటకు దేవుడాయనను లోకములోనికి పంపలేదు. (యోహాను 3:17)

యేసు – సత్యమునుగూర్చి సాక్షమిచ్చుటకు నేను పుట్టితిని, ఇందు నిమిత్తమే యీ లోకమునకు వచ్చితిని; సత్యసంబంధియైన ప్రతివాడును నా మాట వినుననెను. (యోహాను 18:37)

పాపులను రక్షించుటకు క్రీస్తుయేసు లోకమునకు వచ్చెను. (తిమోతి 1:15)

మనము ఆయన ద్వారా జీవించునట్లు, దేవుడు తన అద్వితీయ కుమారుని లోకములోనికి పంపెను; దీనివలన దేవుడు మనయందుంచిన ప్రేమ ప్రత్యక్షపరచబడెను. (1 యోహాను 4:9)

# యేసుక్రీస్తు అసాధారణమైన వ్యక్తిగా జన్మించుట

ఆరవ నెలలో గబ్రియేలను దేవదూత గలిలయలోని నజరేతను ఊరిలో దావీదు వంశస్థుడైన యోసేపను ఒక పురుషునికి ప్రధానము చేయబడిన కన్యక యొద్దకు దేవుని చేత పంపబడెను. ఆ కన్యక పేరు మరియ ఆ దూత మరియా, భయపడకుము, దేవునివలన నీవు కృపపొందితివి. ఇదిగో నీవు గర్భము ధరించి కుమారుని కని ఆయనకు యేసు అను పేరు పెట్టుదువు. (లూకా 1:26-27,30)

- దావీదు కుమారుడవైన యోసేపూ, నీ భార్యయైన మరియను చేర్చుకొనుటకు భయపడకుము, ఆమె గర్భము ధరించినది పరిశుద్ధాత్మ వలన కలిగినది; ఆమె యొక కుమారుని కనును; తన ప్రజలను వారి పాపముల నుండి ఆయనే రక్షించును గనుక ఆయనకు యేసు అను పేరు పెట్టుదువనెను.

(మత్తయి 1:20-21)

# యేసు క్రీస్తు యొక్క జన్మము

ఆ దినములలో సర్వలోకమునకు ప్రజా సంఖ్య వ్రాయవలెనని కైసరు ఔగుస్తువలన ఆజ్ఞ ఆయెను. ఇది కురేనియు సిరియదేశమునకు అధిపతియైయున్నప్పుడు జరిగిన మొదటి ప్రజా సంఖ్య. అందరును ఆ సంఖ్యలో వ్రాయబడుటకు తమతమ పట్టణములకు వెళ్లిరి. యోసేపు దావీదు వంశములోను గోత్రములోను పుట్టినవాడు గనుక, తనకు భార్యగా ప్రధానము చేయబడి గర్భవతియై యుండిన మరియతో కూడ ఆ సంఖ్యలో వ్రాయబడుటకు గలిలయలోని నజరేతు నుండి యూదయలోని బేత్లెహేమనబడిన దావీదు ఊరికి వెళ్లెను. వారక్కడ ఉన్నప్పుడు ఆమె ప్రసవ దినములు నిండెను గనుక తన తొలిచూలు కుమారుని కని, పొత్తిగుడ్డలతో చుట్టి, సత్రములో వారికి స్థలము లేనందున ఆయనను పశువుల తొట్టిలో పరుండబెట్టెను. ఆ దేశములో కొందరు గొర్రెల కాపరులు పొలములో ఉండి రాత్రి వేళ తమ మందను కాచుకొనుచుండగా, ప్రభువు దూత వారి యొద్దకు వచ్చి నిలిచెను; ప్రభువు మహిమ వారి చుట్టు ప్రకాశించినందున, వారు మిక్కిలి భయపడిరి. అయితే ఆ దూత – భయపడకుడి, ఇదిగో ప్రజలందరికిని కలుగబోవు మహా సంతోషకరమైన సువర్తమానము నేను మీకు తెలియజేయుచున్నాను; దావీదు పట్టణమందు నేడు రక్షకుడు మీకొరకు పుట్టియున్నాడు.

(లూకా 2:1–14)

# యేసు క్రీస్తు శిశువుగా

ఆ శిశువునకు సున్నతి చేయవలసిన యెనిమిదవ దినము వచ్చినప్పుడు, గర్భమందాయన పడకమునుపు దేవదూత చేత పెట్టబడిన యేసు అను పేరు వారు ఆయనకు పెట్టిరి.

(లూకా 2:21)

యెరూషలేమునందు సుమెయోనను ఒక మనుష్యుడుండెను. అతడు నీతిమంతుడును భక్తిపరుడునైయుండి, ఇశ్రాయేలు యొక్క ఆదరణకొరకు కనిపెట్టువాడు; పరిశుద్ధాత్మ అతని మీద ఉండెను. అతడు ప్రభువు యొక్క క్రీస్తును చూడక మునుపు మరణము పొందడని అతనికి పరిశుద్ధాత్మచేత బయలుపరచబడియుండెను. ఆత్మవశుడై అతడు దేవాలయములోనికి వచ్చెను. అంతట ధర్మశాస్త్రపద్ధతి చొప్పున ఆయన విషయమై జరిగించుటకు తలిదండ్రులు శిశువైన యేసును దేవాలయములోనికి తీసుకొనివచ్చినప్పుడు అతడు తన చేతులలో ఆయనను ఎత్తికొని దేవుని స్తుతించుచు ఇట్లనెను – నాథా, యిప్పుడు నీ మాట చొప్పున సమాధానముతో నీ దాసుని పోనిచ్చుచున్నావు.

(లూకా 2:25–34)

# యేసు క్రీస్తు ఆరాధింపబడుట

రాజైన హేరోదు దినములయందు యూదయ దేశపు బేత్లెహేములో యేసుపుట్టిన పిమ్మట ఇదిగో తూర్పు దేశపు జ్ఞానులు యెరూషలేమునకు వచ్చి, యూదుల రాజుగా పుట్టినవాడెక్కడ నున్నాడు? తూర్పు దిక్కున మేము ఆయన నక్షత్రము చూచి, ఆయనను పూజింపవచ్చితిమని చెప్పిరి. హేరోదు రాజు ఈ సంగతి విన్నప్పుడు అతడును అతనితో కూడ యెరూషలేము వారందరును కలవరపడిరి. కాబట్టి రాజు ప్రధాన యాజకులను ప్రజలలో నుండు శాస్త్రులను అందరిని సమకూర్చి– క్రీస్తు ఎక్కడ పుట్టునని వారినడిగెను. అందుకు వారు యూదయ బేత్లెహేములోనే; ఏలయనగా యూదయ దేశపు బేత్లెహేమా నీవు యూదా ప్రధానులలో ఎంతమాత్రమును అల్పమైనదానవు కావు; ఇశ్రాయేలను నా ప్రజలను పరిపాలించు అధిపతి నీలో నుండి వచ్చును అని ప్రవక్త ద్వారా వ్రాయబడియున్నదనిరి. వారు ఆ నక్షత్రమును చూచి, అత్యానందభరితులై యింటిలోనికి వచ్చి, తల్లియైన మరియను ఆ శిశువును చూచి, సాగిలపడి, ఆయనను పూజించి, తమ పెట్టెలు విప్పి, బంగారమును సాంబ్రాణిని బోళమును కానుకలుగా ఆయనకు సమర్పించిరి.

(మత్తయి 2:1–5, 10–11)

## యేసు జన్మమునకు ముందు సాతాను అసహ్యించుకొనెను

వారు వెళ్లిన తరువాత ఇదిగో ప్రభువు దూత స్వప్నమందు యోసేపునకు ప్రత్యక్షమై – హేరోదు ఆ శిశువును సంహరింపవలెనని ఆయనను వెదకబోవుచున్నాడు గనుక నీవు లేచి ఆ శిశువును ఆయన తల్లిని వెంటబెట్టుకొని ఐగుప్తునకు పారిపోయి, నేను నీతో తెలియజెప్పు వరకు అక్కడనే యుండుమని అతనితో చెప్పెను. అప్పుడతడు లేచి, రాత్రివేళ శిశువును తల్లిని తోడుకొని, ఐగుప్తునకు వెళ్లి, ఐగుప్తులోనుండి నా కుమారుని పిలిచితిని అని ప్రవక్త ద్వారా ప్రభువు సెలవిచ్చిన మాట నెరవేర్చబడునట్లు హేరోదు మరణమువరకు అక్కడ నుండెను. ఆ జ్ఞానులు తన్ను అపహసించిరని హేరోదు గ్రహించి బహు ఆగ్రహము తెచ్చుకొని, తాను జ్ఞానుల వలన వివరముగా తెలిసికొనిన కాలమును బట్టి, బేత్లెహేములోను దాని సకల ప్రాంతములలోను, రెండు సంవత్సరములు మొదలుకొని తక్కువ వయస్సుగల మగ పిల్లలనందరిని వధించెను. మత్తయి 2: 13–15,

# యేసు క్రీస్తు యొక్క బాల్యము

బాలుడు జ్ఞానముతో నిండుకొనుచు ఎదిగి, బలము పొందుచుండెను; దేవుని దయ ఆయనమీద నుండెను.

పస్కాపండుగప్పుడు ఆయన తల్లిదండ్రులు ఏటేట యెరూషలేమునకు వెళ్లుచుండు వారు. ఆయన పండ్రెండేడ్లవాడైయున్నప్పుడు ఆ పండుగ నాచరించుటకై వాడుక చొప్పున వారు యెరూషలేమునకు వెళ్లిరి. ఆ దినములు తీరిన తరవాత వారు తిరిగి వెళ్లుచుండగా బాలుడైన యేసు యెరూషలేములో నిలిచెను. ఆయన తల్లిదండ్రులు ఆ సంగతి ఎరుగక ఆయన సమూహములో ఉన్నాడని తలంచి, యొక దిన ప్రయాణము సాగిపోయి, తమ బంధువులలోను నెళవైనవారిలోను ఆయనను వెదకుచుండిరి. ఆయన కనబడనందున ఆయనను వెదకుచు యెరూషలేమునకు తిరిగి వచ్చిరి. మూడు దినములైన తరువాత ఆయన దేవాలయములో బోధకుల మధ్య కూర్చుండి వారి మాటలను ఆలకించుచు వారిని ప్రశ్నలడుగుచు ఉండగా చూచిరి. ఆయన మాటలు వినిన వారందరు ఆయన ప్రజ్ఞకును ప్రత్యుత్తరములకును విస్మయమొందిరి.

యేసు జ్ఞానమందును, వయస్సునందును, దేవుని దయ యందును మనుష్యుల దయ యందును వర్ధిల్లుచుండెను (లూకా 2:40-49,52)

# యేసు క్రీస్తు ప్రజలకు పరిచయమవుట

దేవుని యొద్దనుండి పంపబడిన యొక మనుష్యుడు ఉండెను; అతని పేరు యోహాను అందుకతడు – ప్రవక్తయైన యెషయా చెప్పినట్టు నేను ప్రభువు త్రోవ సరాళముచేయుడి అని అరణ్యములో ఎలుగెత్తి చెప్పు ఒకని శబ్దము అని చెప్పెను.

మరునాడు యోహాను యేసు తన యొద్దకు రాగా చూచి – ఇదిగో లోక పాపమును మోసికొని పోవు దేవుని గొర్రెపిల్ల. మరియు యోహాను సాక్షమిచ్చుచు ఆత్మ పావురమువలె ఆకాశము నుండి దిగివచ్చుట చూచితిని; ఆ ఆత్మ ఆయన మీద నిలిచెను.

(యోహాను 1:6,23,29,32)

యేసు బాప్తిస్మము పొందినవెంటనే నీళ్లలోనుండి ఒడ్డునకు వచ్చెను; ఇదిగో ఆకాశము తెరవబడెను, దేవుని ఆత్మ పావురమువలె దిగి తనమీదికి వచ్చుట చూచెను. మరియు – ఇదిగో ఈయనే నా ప్రియకుమారుడు, ఈయనయందు నేనానందించుచున్నానని యొక శబ్దము ఆకాశము నుండి వచ్చెను.

(మత్తయి 3:16–17)

# యేసు క్రీస్తు శోధనలను జయించుట

ఆ శోధకుడు ఆయన యొద్దకు వచ్చి – నీవు దేవుని కుమారుడవైతే ఈ రాళ్లు రొట్టెలగునట్లు ఆజ్ఞాపించుమనెను. అందుకాయన మనుష్యుడు రొట్టెవలన మాత్రము కాదుగాని దేవుని నోటినుండి వచ్చు ప్రతి మాట వలనను జీవించును అని వ్రాయబడియున్నదనెను. అంతట అపవాది పరిశుద్ధ పట్టణమునకు ఆయనను తీసికొనిపోయి దేవాలయ శిఖరమున ఆయనను నిలవబెట్టి – నీవు దేవుని కుమారుడవైతే క్రిందికి దుముకుము – ఆయన నిన్ను గూర్చి తన దూతలకాజ్ఞాపించును, నీ పాదమెప్పుడైనను రాతికి తగలకుండ వారు నిన్ను చేతులతో ఎత్తికొందురు అని వ్రాయబడి ఉన్నదని ఆయనతో చెప్పెను.అందుకు యేసు– ప్రభువైన నీ దేవుని నీవు శోధింపవలదని మరియొక చోట వ్రాయబడియున్నదని వానితో చెప్పెను. మరల అపవాది మిగుల ఎత్తయిన యొక కొండమీదికి ఆయనను తోడుకొని పోయి, యీ లోక రాజ్యములన్నిటిని, వాటి మహిమను ఆయనకు చూపి – నీవు సాగిలపడి నాకు నమస్కారము చేసిన యెడల వీటన్నిటిని నీకిచ్చెదనని ఆయనతో చెప్పగా యేసు వానితో – సాతానా పొమ్ము – ప్రభువైన నీదేవునికి మ్రొక్కి ఆయనను మాత్రము సేవింపవలెను అని వ్రాయబడియున్నదనెను. (మత్తయి 4:3–10)

# యేసు క్రీస్తు శిష్యులను పిలుచుట

ఆయన గలిలయ సముద్రతీరమున వెళ్లుచుండగా సీమోనును సీమోను సహోదరుడగు అంద్రెయయు, సముద్రములో వలవేయుట చూచెను, వారు జాలరులు; యేసు – నా వెంబడి రండి, నేను మిమ్మును, మనుష్యులను పట్టు జాలరులనుగా చేసెదనని వారితో చెప్పెను! వెంటనే వారు తమ వలలు విడిచి ఆయనను వెంబడించిరి. ఆయన ఇంక కొంత దూరము వెళ్లి జెబెదయి కుమారుడగు యాకోబును అతని సహోదరుడగు యోహానును చూచెను; వారు దోనెలో ఉండి తమ వలలు బాగుచేసికొనుచుండిరి. వెంటనే ఆయన వారిని పిలువగా వారు తమ తండ్రియైన జెబెదయిని దోనెలో జీతగాండ్ర యొద్ద విడిచి పెట్టి ఆయనను వెంబడించిరి.

(మార్కు 1:16–20)

మరునాడు ఆయన గలిలయకు వెళ్లగోరి ఫిలిప్పును కనుగొని – నన్ను వెంబడించుమని అతనితో చెప్పెను.

(యోహాను 1:43)

ఆయన మార్గమున వెళ్లుచు, సుంకపు మెట్టునొద్ద కూర్చున్న అల్ఫయి కుమారుడగు లేవిని చూచి – నన్ను వెంబడించుమని అతనితో చెప్పగా, అతడు లేచి, ఆయనను వెంబడించెను.

(మార్కు 2:14)

# యేసు క్రీస్తు సువార్తను ప్రకటించుట

అప్పుడు యేసు, ఆత్మ బలముతో గలిలయకు తిరిగి వెళ్లెను; ఆయననుగూర్చిన సమాచారము ఆ ప్రదేశమందంతట వ్యాపించెను. ఆయన అందరిచేత ఘనత నొంది, వారి సమాజ మందిరములో బోధించుచువచ్చెను. తరువాత ఆయన తాను పెరిగిన నజరేతునకు వచ్చెను. తన వాడుక చొప్పున విశ్రాంతి దినమందు సమాజ మందిరములోనికి వెళ్లి, చదువుటకై నిలుచుండగా ప్రవక్తయైన యెషయా గ్రంథము ఆయన చేతికియ్యబడెను; ఆయన గ్రంథము విప్పగా ప్రభువు ఆత్మ నామీద ఉన్నది బీదలకు సువార్త ప్రకటించుటకై ఆయన నన్ను అభిషేకించెను చెరలోనున్న వారికి విడుదలను, గ్రుడ్డివారికి చూపును, (కలుగునని) ప్రకటించుటకును నలిగిన వారిని విడిపించుటకును ............ఆయన నన్ను పంపియున్నాడు అని వ్రాయబడిన చోటు ఆయనకు దొరకెను. ఆయన గ్రంథము చుట్టి పరిచారకునికిచ్చి కూర్చుండెను. (లూకా 4:14-20)

## యేసు దేవాలయమును శుభ్రపరచుట 

వారు యెరూషలేమునకు వచ్చినప్పుడు ఆయన దేవాలయములో ప్రవేశించి, దేవాలయములో క్రయ విక్రయములు చేయు వారిని వెళ్లగొట్టనారంభించి, రూకలు మార్చు వారి బల్లలను, గువ్వలమ్మువారి పీటలను పడద్రోసి, దేవాలయము గుండ ఏ పాత్రయైనను ఎవనిని తేనియ్యకుండెను.

మరియు, ఆయన బోధించుచు - నా మందిరము సమస్తమైన అన్యజనులకు ప్రార్ధన మందిరమనబడును అని వ్రాయబడలేదా? అయితే మీరు దానిని దొంగల గుహగా చేసితిరనెను.

(మార్కు 11:15, 17)

# యేసు పాపమును గూర్చి బోధించుట

ఆలాగే మీరు వెలుపల మనుష్యులకు నీతిమంతులుగా నగపడుచున్నారు గాని, లోపల వేషధారణతోను అక్రమముతోను నిండియున్నారు.

(మత్తయి 23:28)

నోటనుండి బయటికి వచ్చునవి హృదయములోనుండివచ్చును, ఇవే మనుష్యుని అపవిత్రపరచుచున్నవని మీరు గ్రహింపరా? దురాలోచనలు, నరహత్యలు, వ్యభిచారములు, వేశ్యాగమనములు, దొంగతనములు, అబద్ధసాక్ష్యములు, దేవ దూషణలు హృదయములోనుండియే వచ్చును.

(మత్తయి 15:18, 19)

అందుకు యేసు – పాపము చేయు ప్రతివాడును పాపమునకు దాసుడని మీతో నిశ్చయముగా చెప్పుచున్నాను.

కుమారుడు మిమ్మును స్వతంత్రులనుగా చేసిన యెడల మీరు నిజముగా స్వతంత్రులై యుందురు.

(యోహాను 8:34,36)

# యేసు నూతన జీవమిచ్చుట

అందుకు యేసు అతనితో – ఒకడు క్రొత్తగా జన్మించితేనే కాని అతడు దేవుని రాజ్యమును చూడలేడని నీతో నిశ్చయముగా చెప్పుచున్నాననెను.

మీరు క్రొత్తగా జన్మింపవలెనని నేను నీతో చెప్పినందుకు ఆశ్చర్యపడవద్దు.

దేవుడు లోకమును ఎంతో ప్రేమించెను. కాగా ఆయన తన అద్వితీయకుమారునిగా పుట్టిన వాని యందు విశ్వాసముంచు ప్రతివాడును నశింపక నిత్యజీవము పొందునట్లు ఆయనను అనుగ్రహించెను. (యోహాను 3:3, 7, 16)

అద్వితీయ సత్యదేవుడవైన నిన్నును, నీవు పంపిన యేసుక్రీస్తును ఎరుగుటయే నిత్యజీవము.

(యోహాను 17:3)

గొర్రెలకు జీవము కలుగుటకును అది సమృద్ధిగా కలుగుటకును నేను వచ్చితినని మీతో నిశ్చయముగా చెప్పుచున్నాను.

(యోహాను 10:10)

కాగా ఎవడైనను క్రీస్తునందున్నయెడల వాడు నూతన సృష్టి: పాతవి గతించెను, క్రొత్త వాయెను.
(2 కొరింథీ 5:17)

# యేసు క్రీస్తు జీవజలమును ఇచ్చుట

యాకోబు తనకుమారుడైన యోసేపుకిచ్చిన భూమి దగ్గరనున్న సమరయలోని సుఖారను ఒక ఊరికి వచ్చెను. అక్కడ యాకోబు బావి ఉండెను గనుక యేసు ప్రయాణమువలన అలసియున్న రీతినే ఆ బావియొద్ద కూర్చుండెను; అప్పటికించుమించు పండ్రెండు గంటలాయెను. సమరయ స్త్రీ ఒకతె నీళ్లు చేదుకొనుటకు అక్కడికి రాగా యేసు – నాకు దాహమునకిమ్మని ఆమెనడిగెను. ఆయన శిష్యులు ఆహారము కొనుటకు ఊరిలోనికి వెళ్లియుండిరి. ఆ సమరయ స్త్రీ – యూదుడవైన నీవు సమరయస్త్రీనైన నన్ను దాహమునకిమ్మని యేలాగు అడుగుచున్నావని ఆయనతో చెప్పెను. ఏలయనగా యూదులు సమరయులతో సాంగత్యము చేయరు. అందుకు యేసు – నీవు దేవుని వరమును – నాకు దాహమునకిమ్మని నిన్ను అడుగుచున్నవాడెవడో అదియు ఎరిగియుంటే నీవు ఆయనను అడుగుదువు, ఆయన నీకు జీవజలమిచ్చునని ఆమెతో చెప్పెను. అందుకు యేసు – ఈ నీళ్లు త్రాగుప్రతివాడును మరల దప్పిగొనును. నేనిచ్చు నీళ్లు త్రాగువాడెప్పుడును దప్పిగొనడు. నేను వానికిచ్చు నీళ్లు నిత్యజీవమునకై వానిలో ఊరెడి నీటిబుగ్గగా ఉండునని ఆమెతో చెప్పెను.

(యోహాను 4:5–10,13,14)

కాబట్టి యీ నా మాటలు విని వాటిచొప్పున చేయు ప్రతివాడును బండమీద తన యిల్లు కట్టుకొనిన బుద్ధిమంతుని పోలియుండును. వాన కురిసెను, వరదలు వచ్చెను, గాలి విసిరి ఆ యింటి మీద కొట్టెను గాని దాని పునాది బండమీద వేయబడెను గనుక అది పడలేదు. మరియు యీ నా మాటలు విని వాటిచొప్పున చేయని ప్రతివాడు ఇసుక మీద తన యిల్లుకట్టుకొనిన బుద్ధిహీనుని పోలియుండును. వాన కురిసెను, వరదలు వచ్చెను, గాలి విసిరి ఆ యింటి మీద కొట్టెను, అప్పుడది కూలబడెను, దాని పాటు గొప్పదని చెప్పెను. (మత్తయి 7:24-27)

- మీలో ఏ మష్యునికైనను నూరు గొర్రెలు కలిగియుండగా వాటిలో ఒకటి తప్పిపోయిన యెడల అతడు తొంబది తొమ్మిదింటిని అడవిలో విడిచిపెట్టి, తప్పి పోయినది దొరుకువరకు దానిని వెదక వెళ్లడా? అది దొరికినప్పుడు సంతోషముతో దానిని తన భుజములమీద వేసికొని తన యింటికి వచ్చి తన స్నేహితులను పొరుగు వారిని పిలిచి, మీరు నాతో కూడ సంతోషించుడి. తప్పి పోయిన నా గొర్రె దొరికినదని వారితో చెప్పునుగదా.

(లూకా 15:4-7)

# ఎలా దీవించబడుతామో యేసు బోధించుట

ఆయన ఆ జనసమూహములను చూచి కొండయెక్కి కూర్చుండగా ఆయన శిష్యులాయన యొద్దకు వచ్చిరి. అప్పుడాయన నోరు తెరచి యిలాగు బోధింపసాగెను. ఆత్మ విషయమైదీనులైన వారు ధన్యులు; పరలోకరాజ్యము వారిది. దు:ఖపడు వారు ధన్యులు; వారు ఓదార్చబడుదురు. సాత్వికులు ధన్యులు; వారుభూలోకమును స్వతంత్రించుకొందురు. నీతి కొరకు ఆకలిదప్పులు గలవారు ధన్యులు; వారు తృప్తిపరచబడుదురు. కనికరము గలవారు ధన్యులు; వారు కనికరము పొందుదురు. హృదయశుద్ధి గలవారు ధన్యులు; వారు దేవుని చూచెదరు. సమాధానపరచు వారు ధన్యులు; వారు దేవుని కుమారులనబడుదురు. నీతి నిమిత్తము హింసింపబడు వారు ధన్యులు; పరలోకరాజ్యము వారిది. నా నిమిత్తము జనులు మిమ్మును నిందించి హింసించి మీ మీద అబద్ధముగా చెడ్డమాటలెల్ల పలుకునప్పుడు మీరు ధన్యులు; సంతోషించి ఆనందించుడి పరలోకమందు మీ ఫలము అధికమగును.

(మత్తయి 5:1-11)

నా విషయమై అభ్యంతరపడనివాడు ధన్యుడని వారికి ఉత్తరమిచ్చెను. (లూకా 7:23)

# యేసు క్రీస్తు ప్రార్థనను గూర్చి బోధించుట

వారు విసుకక నిత్యము ప్రార్థన చేయుచుండవలెననుటకు ఆయన వారితో ఈ ఉపమానము చెప్పెను. (లూకా 18:1)

ప్రార్థన చేయుటకై ఇద్దరు మనుష్యులు దేవాలయమునకు వెళ్లిరి. వారిలో ఒకడు పరిసయ్యుడు, ఒకడు సుంకరి. పరిసయ్యుడు నిలువబడి - దేవా, నేను చోరులును అన్యాయస్థులును వ్యభిచారులునైన యితర మనుష్యులవలెనైనను, ఈ సుంకరివలెనైనను ఉండనందుకు నీకు కృతజ్ఞతాస్తుతులు చెల్లించుచున్నాను. వారమునకు రెండు మారులు ఉపవాసము చేయుచు నా సంపాదన అంతటిలో పదియవ వంతు చెల్లించుచున్నానని తనలో తాను ప్రార్థించుచుండెను. అయితే సుంకరి దూరముగా నిలుచుండి, ఆకాశమువైపు కన్నులెత్తుటకైనను ధైర్యము చాలక రొమ్ముకొట్టుకొనుచు - దేవా, పాపినైన నన్ను కరుణించుమని పలికెను. అతని కంటె ఇతడు నీతిమంతుడుగా తీర్చబడి తనయింటికి వెళ్లెనని మీతో చెప్పుచున్నాను. తన్ను తాను హెచ్చించుకొనువాడు తగ్గింపబడుననియు, తన్ను తాను తగ్గించుకొనువాడు హెచ్చింపబడుననియు చెప్పెను.

(లూకా 18: 10-14)

మీరు ప్రార్థన చేయునప్పుడు వేటిని అడుగుదురో అవి (దొరికినవని) నమ్మిన యెడల మీరు వాటినన్నిటిని పొందుదురని వారితో చెప్పెను. (మత్తయి 21;22)

# యేసు శిష్యులను గూర్చి బోధించుట

అప్పుడు యేసు తన శిష్యులను చూచి - ఎవడైనను నన్ను వెంబడింపగోరిన యెడల, తన్నుతాను ఉపేక్షించుకొని, తన సిలువనెత్తికొని నన్ను వెంబడిరెను. తన ప్రాణమును రక్షించు కొనగోరువాడు దాని పోగొట్టుకొనును; నా నిమిత్తము తన ప్రాణమును పోగొట్టుకొనువాడు దాని దక్కించుకొనును. ఒక మనుష్యుడు లోకమంతయు సంపాదించుకొని తన ప్రాణమును పోగొట్టుకొంటే అతని కేమి ప్రయోజనము?

(మత్తయి 16: 24-26)

ఆ ప్రకారమే మీలో తనకు కలిగినదంతయు విడిచి పెట్టనివాడు నా శిష్యుడు కానేరడు. (లూకా 14:33)

మీరు నన్ను ప్రేమించిన యెడల నా ఆజ్ఞలనుగైకొందురు. (యోహాను 14:15)

మీరు ఒకని యెడల ఒకడు ప్రేమగలవారైనయెడల దీనిబట్టి నా శిష్యులని అందరును తెలిసికొందురనెను. (యోహాను 13:35)

కాబట్టి యేసు, తనను నమ్మిన యూదులతో-మీరు నా వాక్యమందు నిలిచినవారైతే నిజముగా నాకు శిష్యులైయుండి సత్యమును గ్రహించెదరు. (యోహాను 8:31)

మీరు బహుగా ఫలించుటవలన నా తండ్రి మహిమపరచబడును; ఇందువలన మీరు నా శిష్యులగుదురు. (యోహాను 15:8)

ప్రభువా, ప్రభువా, అని నన్ను పిలుచు ప్రతివాడును పరలోకరాజ్యములో ప్రవేశింపడు గాని పరలోకమందున్న నా తండ్రి చిత్త ప్రకారము చేయువాడే ప్రవేశించును. (మత్తయి 7:21)

మీరు మార్పునొంది బిడ్డల వంటి వారైతేనే గాని పరలోకరాజ్యములో ప్రవేశింపరని మీతో నిశ్చయముగా చెప్పుచున్నాను. (మత్తయి 18:3)

ఇరుకు ద్వారమున ప్రవేశించుడి; నాశనమునకు పోవు ద్వారము వెడల్పును, ఆ దారి విశాలమునై యున్నది, దాని ద్వారా ప్రవేశించువారు అనేకులు. జీవమునకు పోవు ద్వారము ఇరుకును ఆ దారి సంకుచితమునై యున్నది, దాని కనుగొనువారు కొందరే. (మత్తయి 7:13-14)

నా తండ్రి ఇంట అనేక నివాసములు కలవు, లేని యెడల మీతో చెప్పుదును; మీకు స్థలము సిద్ధపరచ వెళ్లుచున్నాను.

నేను వెళ్లి మీకు స్థలము సిద్ధపరచిన యెడల నేనుండు స్థలములో మీరును ఉండులాగున మరల వచ్చి నా యొద్ద నుండుటకు మిమ్మును తీసికొనిపోవుదును. (యోహాను 14:2-3)

# యేసు ఏమైయున్నాడో తెలియజేయుట

పరలోకమునుండి దిగి వచ్చిన జీవాహారమును నేనే. ఎవడైనను ఈ ఆహారము భుజించితే వాడెల్లప్పుడును జీవించును; మరియు నేనిచ్చు ఆహారము లోకమునకు జీవముకొరకైన నా శరీరమే అని మీతో నిశ్చయముగా చెప్పుచున్నాననెను. (యోహాను 6:51)

నేనే ద్వారమును; నాద్వారా ఎవడైన లోపల ప్రవేశించిన యెడల వాడు రక్షింపబడినవాడై, లోపలికి పోవుచు బయటికి వచ్చుచు మేతమేయుచునుండును. నేను గొర్రెలకు మంచి కాపరిని; మంచి కాపరి గొర్రెల కొరకు తన ప్రాణమును పెట్టును. (యోహాను 10:9,11)

యేసు – నేనే మార్గమును, సత్యమును, జీవమును; నా ద్వారానే తప్ప యెవడును తండ్రి యొద్దకు రాడు. (యోహాను 14:6)

నేను లోకమునకు వెలుగును, నన్ను వెంబడించువాడు చీకటిలో నడువక జీవపు వెలుగు గలిగియుండునని వారితో చెప్పెను. (యోహాను 8:12)

అందుకు యేసు – పునరుత్థానమును జీవమును నేనే, నా యందు విశ్వాసముంచువాడు చనిపోయినను బ్రదుకును. (యోహాను 11:25)

# యేసు రోగములపై అధికారం కలిగిఉండుట

ఇదిగో కుష్ఠరోగి వచ్చి ఆయనకు మ్రొక్కి – ప్రభువా, నీకిష్టమైతే నన్ను శుద్ధునిగా చేయగలవనెను. అందుకాయన చెయ్యిచాపి వాని ముట్టి – నాకిష్టమే, నీవు శుద్ధుడవు కమ్మని చెప్పగా తక్షణమే వాని కుష్ఠరోగము శుద్ధియాయెను. (మత్తయి 8:2–3)

పదునెనిమిది ఏండ్ల నుండి బలహీనపరచు దయ్యము పట్టిన యొక స్త్రీ అచ్చట నుండెను. ఆమె నడుము వంగిపోయి ఎంత మాత్రమును చక్కగా నిలువబడలేకుండెను. యేసు ఆమెను చూచి, రమ్మని పిలిచి – అమ్మా నీ బలహీనత నుండి విడుదల పొందియున్నావని ఆమెతో చెప్పి ఆమె మీద చేతులుంచగానే ఆమె చక్కగా నిలువబడి దేవుని మహిమపరచెను. (లూకా 13:11–13)

బహు జనసమూహములు ఆయన యొద్దకు కుంటివారు గ్రుడ్డివారు మూగవారు అంగహీనులు మొదలైన అనేకులను తీసుకొని వచ్చి ఆయన పాదముల యొద్ద పడవేసిరి. ఆయన వారిని స్వస్థపరచెను. (మత్తయి 15:30)

సీమోను అత్త జ్వరముతో పడియుండగా, వెంటనే వారామెను గూర్చి ఆయనతో చెప్పిరి. ఆయన ఆమెదగ్గరికి వచ్చి, చెయ్యిపట్టి ఆమెను లేవనెత్తెను; అంతట జ్వరము ఆమెను వదలెను గనుక ఆమె వారికి ఉపచారము చేయసాగెను. (మార్కు 1:30–310)

# ప్రకృతిపై యేసు క్రీస్తు అధికారం కలిగిఉండుట

రాత్రి నాలుగవ జామున ఆయన సముద్రము మీద నడుచుచు వారి యొద్దకు వచ్చెను. ఆయన సముద్రము మీద నడుచుట శిష్యులు చూచి తొందరపడి, భూతమని చెప్పుకొని భయము చేత కేకలు వేసిరి. వెంటనే యేసు - ధైర్యము తెచ్చుకొనుడి, నేనే భయపడకుడని వారితో చెప్పెను.

(మత్తయి 14:25-27)

అప్పుడు పెద్ద తుఫాను రేగి ఆయన యున్న దోనెమీద అలలు కొట్టినందున దోనె నిండిపోయెను. ఆయన దోనె అమరమున తలగడమీద (తలవాల్చుకొని) నిద్రించుచుండెను. వారాయనను లేపి బోధకుడా, మేము నశించిపోవుచున్నాము; నీకు చింతలేదా? అని ఆయనతో అనిరి. అందుకాయన లేచి గాలిని గద్దించి - నిశ్శబ్దమై ఊరుకుండుమని సముద్రముతో చెప్పగా, గాలి అణగి మిక్కిలి నిమ్మళమాయెను.

(మార్కు 4:37-39)

అయినను పాపములు క్షమించుటకు భూమిమీద మనుష్యకుమారునికి అధికారము కలదని మీరు తెలిసికొనవలెను అని చెప్పి, ఆయన పక్షవాయువు గలవాని చూచి – నీవు లేచి నీ మంచమెత్తుకొని నీ యింటికి పొమ్మని చెప్పగా వాడు లేచి తన యింటికి వెళ్లెను. (మత్తయి 9:6–7)

నీ పాపములు క్షమింపబడియున్నవి అని ఆమెతో అనెను. అప్పుడాయనతో కూడ భోజన పంక్తిని కూర్చుండినవారు పాపములు క్షమించుచున్న యితడెవడని తమలో తాము అనుకొనసాగిరి. (లూకా 7:48–49)

దేవుని కృపామహదైశ్వర్యమును బట్టి ఆ ప్రియునియందు ఆయన రక్తమువలన మనకు విమోచనము, అనగా మన అపరాధములకు క్షమాపణ మనకు కలిగియున్నది! (ఎఫెసీ 1:7)

మన పాపములను మనము ఒప్పుకొనిన యెడల, ఆయన నమ్మదగినవాడును నీతిమంతుడును గనుక ఆయన మన పాపములను క్షమించి సమస్త దుర్నీతి నుండి మనలను పవిత్రులనుగా చేయును.

(1 యోహాను 1:9)

# దయ్యాలపై యేసు అధికారం కలిగిన వాడు

ఆ సమాజమందిరములో అపవిత్రమైన దయ్యపు ఆత్మపట్టిన వాడొకడుండెను. వాడు - నజరేయుడైన యేసూ మాతో నీకేమి? మమ్ము నశింపజేయవచ్చితివా? నీవెవడవో నేనెరుగుదును, నీవు దేవుని పరిశుద్ధుడవని బిగ్గరగా కేకలు వేసెను. అందుకు యేసు – ఊరుకుండుము, ఇతనిని వదలి పొమ్మని దానిని గద్దింపగా, దయ్యము వానిని వారి మధ్యను పడద్రోసి వానికి ఏ హానియు చేయక వదలిపోయెను. అందుకందరు విస్మయమొంది – ఇది ఎట్టి మాట? ఈయన అధికారముతోను బలముతోను అపవిత్రాత్మలకు ఆజ్ఞాపింపగానే అవి వదలి పోవుచున్నవని యొకనితో నొకడు చెప్పుకొనిరి.

(లూకా 4:33:36)

వాడు వచ్చుచుండగా ఆ దయ్యము వానిని పడద్రోసి, విలవిలలాడించెను; యేసు ఆ అపవిత్రాత్మను గద్దించి బాలుని స్వస్థపరచి వాని తండ్రి కప్పగించెను. గనుక అందరు దేవుని మహాత్మ్యమును చూచి ఆశ్చర్యపడిరి.

(లూకా 9:42–43)

## యేసు మరణంపై అధికారం కలిగినవాడు



యేసు – రాయి తీసివేయుడని చెప్పగా చనిపోయినవాని సహోదరియైన మార్త – ప్రభువా అతడు చనిపోయి నాలుగు దినములైనది గనుక ఇప్పటికి వాసనకొట్టునని ఆయనతో చెప్పెను. అందుకు యేసు – నీవు నమ్మిన యెడల దేవుని మహిమ చూతువని నేను నీతో చెప్పలేదా అని ఆమెతో అనెను.

(యోహాను 11:39,40)

ఆయన ఆలాగు చెప్పి – లాజరూ, బయటికి రమ్మని బిగ్గరగా చెప్పగా చనిపోయిన వాడు, కాళ్లు చేతులు ప్రేత వస్త్రములతో కట్టబడినవాడై వెలుపలికి వచ్చెను; అతని ముఖమునకు రుమాలు కట్టియుండెను. అంతట యేసు మీరు అతని కట్లు విప్పిపోనియ్యుడని వారితో చెప్పెను.

(యోహాను 11:43–44)

ఆయన ఆ ఊరి గవిని యొద్దకు వచ్చినప్పుడు, చనిపోయిన యొకడు వెలుపలికి మోసికొని పోబడుచుండెను. అతని తల్లికి అతడొక్కడే కుమారుడు, ఆమె విధవరాలు; ఆ ఊరి జనులు అనేకులు ఆమెతో కూడా ఉండిరి. ప్రభువు ఆమెను చూచి ఆమె యందు కనికరపడి – ఏడువవద్దని ఆమెతో చెప్పి, దగ్గరకు వచ్చి పాడెను ముట్టగా మోయుచున్నవారు నిలిచిరి. ఆయన చిన్నవాడా, లెమ్మని నీతో చెప్పుచున్నాననగా ఆ చనిపోయిన వాడు లేచి కూర్చుండి మాటలాడసాగెను ఆయన అతనిని అతని తల్లికి అప్పగించెను.

(లూకా 7:12–15)

మనుష్యకుమారుడెవడని జనులు చెప్పుకొనుచున్నారని తన శిష్యులను అడుగగా వారు – కొందరు బాప్తిస్మమిచ్చు యోహాననియు, కొందరు ఏలీయా అనియు, కొందరు యిర్మీయా అనియు లేక ప్రవక్తలలో ఒకడనియు చెప్పుకొనుచున్నారనిరి. అందుకాయన మీరైతే నేను ఎవడని చెప్పుకొనుచున్నారని వారి నడిగెను. అందుకు సీమోను పేతురు నీవు సజీవుడగు దేవుని కుమారుడవైన క్రీస్తువని చెప్పెను. అందుకు యేసు – సీమోను బర్‌యోనా, నీవు ధన్యుడవు, పరలోకమందున్న నా తండ్రి ఈ సంగతి నీకు బయలుపరచెనే కాని నరులు నీకు బయలుపరచలేదు.

(మత్తయి 16:13–17)

వారిలో అనేకులు – వాడు దయ్యముపట్టినవాడు, వెర్రివాడు; వాని మాట ఎందుకు వినుచున్నారనిరి. మరికొందరు ఇవి – దయ్యము పట్టిన వాని మాటలుకావు; దయ్యము గ్రుడ్డివారి కన్నులు తెరువగలదా అనిరి.
(యోహాను 10:20–21)

నన్ను నిర్హేతుకముగా ద్వేషించిరి. (యోహాను 15:25)

# యేసు క్రీస్తు చనిపోవుటకు యెరూషలేముకు వెళ్లుట



మరునాడు ఆ పండుగకు వచ్చిన జనసమూహము యేసు యెరూషలేమునకు వచ్చుచున్నాడని విని ఖర్జూరపు మట్టలు పట్టుకొని ఆయనను ఎదుర్కొనబోయి జయము, ప్రభువు పేరట వచ్చుచున్న ఇశ్రాయేలు రాజు స్తుతింపబడునుగాక అని కేకలు వేసిరి. సీయోను కుమారీ, భయపడకుము, ఇదిగో నీ రాజు గాడిదపిల్ల మీద ఆసీనుడై వచ్చుచున్నాడు అని వ్రాయబడిన ప్రకారము యేసు ఒక చిన్నగాడిదను కనుగొని దాని మీద కూర్చుండెను! (యోహాను 12:12-15)

ఆయన పట్టణమునకు సమీపించినప్పుడు దానిని చూచి దాని విషయమై యేడ్చి – నీవును ఈ నీ దినమందైనను సమాధానసంబంధమైన సంగతులను తెలిసికొనినయెడల నీకెంతో మేలు; గాని యిప్పుడవి నీకన్నులకు మరుగు చేయబడియున్నవి. (ప్రభువు) నిన్ను దర్శించిన కాలము నీవు ఎరుగకుంటివి గనుక నీ శత్రువులు నీ చుట్టు గట్టుకట్టి ముట్టడి వేసి అన్ని ప్రక్కలను నిన్ను అరికట్టి, నీలో నున్న నీ పిల్లలతో కూడా నిన్ను నేల కలిపి నీలో రాతిమీద రాయి నిలిచి యుండనియ్యని దినములు వచ్చునని చెప్పెను. (లూకా 19: 41-44)

# యేసు పస్కా గొఱ్ఱె

మరునాడు యోహాను యేసు తన యొద్దకు రాగా చూచి - ఇదిగో లోకపాపమును మోసికొనిపోవు దేవుని గొఱ్ఱె పిల్ల. (యోహాను 1:29)

పస్కాపశువును వధింపవలసిన పులియని రొట్టెల దినమురాగా యేసు పేతురును యోహానును చూచి- మీరు వెళ్లి మనము భుజించుటకై పస్కాను మన కొరకు సిద్ధపరచుడని వారిని పంపెను. పిమ్మట ఆయన యొక రొట్టె పట్టుకొని కృతజ్ఞతాస్తుతులు చెల్లించి దాని విరిచి, వారికిచ్చి - ఇది మీకొరకు ఇయ్యబడుచున్న నా శరీరము, నన్ను జ్ఞాపకము చేసుకొనుటకు దీనిని చేయుడని చెప్పెను... పిమ్మట ఆయన గిన్నెనుపట్టుకొని కృతజ్ఞతాస్తుతులు చెల్లించి దాని వారికిచ్చెను; వారందరు, దానిలోనిది త్రాగిరి. అప్పుడాయన ఇది - నిబంధన విషయమై అనేకుల కొరకు చిందింపబడుచున్న నారక్తము.! (లూకా 22:7-8, 19, మార్కు 14:23,24)

ఇంతేకాక క్రీస్తు అను మన పస్కాపశువు వధింపబడెను. (1 కొరింథీ 5:7)

పండ్రెండు మందిలో నొకడగు ఇస్కరియోతు యూదా, ప్రధానయాజకుల చేతికి ఆయనను అప్పగింపవలెనని వారి యొద్దకు పోగా వారు విని, సంతోషించి వానికి ద్రవ్యమిత్తుమని వాగ్దానము చేసిరి గనుక వాడు ఆయనను అప్పగించుటకు తగిన సమయము కనిపెట్టుచుండెను.

(మార్కు 14:10, 11)

కావున యూదా సైనికులను, ప్రధానయాజకులు పరిసయ్యులు పంపిన బంట్రౌతులను వెంటబెట్టుకొని, దివిటీలతోను దీపములతోను ఆయుధములతోను అక్కడికివచ్చెను......అంతట సైనికులును సహస్రాధిపతియు, యూదుల బంట్రౌతులును యేసును పట్టుకొని ఆయనను బంధించి, మొదట అన్న యొద్దకు ఆయనను తీసికొనిపోయిరి. (యోహాను 18:3 ;యోహాను 18:12)

ప్రధానయాజకులును మహాసభవారందరును యేసును చంపించవలెనని ఆయనమీద సాక్ష్యము వెదకిరిగాని యేమియు వారికి దొరకలేదు. అనేకులు ఆయన మీద అబద్ధసాక్ష్యము పలికినను వారి సాక్ష్యములు ఒకదానికి ఒకటి సరిపడలేదు.

(మార్కు 14:55-56)

# యేసు శిక్షింపబడుట మరియు సిలువవేయబడుట

ఉదయమైనప్పుడు ప్రధాన యాజకులును, ప్రజల పెద్దలందరును యేసును చంపింపవలెనని ఆయనకు విరోధముగా ఆలోచన చేసి, ఆయనను బంధించి, తీసికొనిపోయి, అధిపతియైన పొంతిపిలాతునకు అప్పగించిరి. అందుకు పిలాతు – ఆలాగైతే క్రీస్తనబడిన యేసును ఏమిచేతునని వారినడుగగా – సిలువవేయమని అందరును చెప్పిరి. (మత్తయి 27:1–2,22)

ఆయనను సిలువవేసినప్పుడు పగలు తొమ్మిది గంటలాయెను. మరియు యూదులరాజైన యేసు అని ఆయనమీద మోపబడిన నేరమును వ్రాసి పైగా ఉంచిరి. మరియు కుడివైపున ఒకనిని ఎడమవైపున ఒకనిని ఇద్దరు బందిపోటు దొంగలను ఆయనతో కూడ సిలువవేసిరి.

(మార్కు 15:25–27)

అప్పుడు యేసు గొప్ప శబ్దముతో కేకవేసి – తండ్రీ, నీ చేతికి నా ఆత్మను అప్పగించు కొనుచున్నాననెను. ఆయన యిలాగు చెప్పి ప్రాణము విడిచెను. (లూకా 23:46)

## మరణమును సాక్షుల ద్వారా పిర్యాదు చేయుట

కాబట్టి సైనికులు వచ్చి ఆయనతో కూడ సిలువవేయబడిన మొదటివాని కాళ్లను రెండవ వాని కాళ్లను విరుగగొట్టిరి. వారు యేసునొద్దకు వచ్చి, అంతకు ముందే ఆయన మృతి పొందియుండుట చూచి ఆయన కాళ్లు విరుగగొట్టలేదు గాని, సైనికులలో ఒకడు ఈటెతో ఆయన ప్రక్కను పొడిచెను, వెంటనే రక్తమును నీళ్లును కారెను. ఇది చూచిన వాడు సాక్షమిచ్చుచున్నాడు; అతని సాక్ష్యము సత్యమే. మీరు నమ్మునట్లు అతడు సత్యము చెప్పుచున్నాడని ఆయనెరుగును. – అతని యెముకలలో ఒకటైనను విరువబడదు అను లేఖనము నెరవేరునట్లు ఇవి జరిగెను. మరియు – తాము పొడిచినవాని తట్టుచూతురు అని మరియొక లేఖనము చెప్పుచున్నది.

(యోహాను 19:32–37)

మీరు పరిశుద్ధుడును నీతిమంతుడునైన వానిని నిరాకరించి, నరహంతకుడైన మనుష్యుని మీకు అనుగ్రహింపుమని అడిగితిరి. మీరు జీవాధిపతిని చంపితిరి గాని దేవుడు ఆయనను మృతులోనుండి లేపెను; అందుకు మేము సాక్షులము. (అ.కా. 3:14–15)

# యేసు సమాధి చేయబడి తిరిగి మూడవ దినమున తిరిగిలేచుట

మరునాడు అనగా సిద్ధపరచు దినమునకు మరుసటి దినమున ప్రధానయాజకులును పరిసయ్యులును పిలాతు నొద్దకు కూడివచ్చి – అయ్యా, ఆ వంచకుడు సజీవుడై యుండినప్పుడు – మూడు దినములైన తరువాత నేను లేచెదనని చెప్పినది మాకు జ్ఞాపకమున్నది. కాబట్టి మూడవ దినము వరకు సమాధిని భద్రము చేయ నాజ్ఞాపించుము; వాని శిష్యులు వచ్చి వానిని ఎత్తికొనిపోయి – ఆయన మృతులలో నుండి లేచెనని ప్రజలతో చెప్పుదురేమో; అప్పుడు మొదటి వంచనకంటె కడపటి వంచన మరి చెడ్డదై యుండునని చెప్పిరి. అందుకు పిలాతు – కావలి వారున్నారుగదా మీరు వెళ్లి మీ చేతనైనంత మట్టుకు సమాధిని భద్రము చేయుడని వారితో చెప్పెను. వారు వెళ్లి కావలివారిని కూడ ఉంచుకొని, రాతికి ముద్రవేసి సమాధిని భద్రముచేసిరి.

(మత్తయి 27; 62–66)

విశ్రాంతిదినము గడచిపోయిన తరువాత ఆదివారమున, తెల్లవారుచుండగా మగ్దలేనే మరియయు వేరొక మరియయు సమాధిని చూడవచ్చిరి. ఇదిగో ప్రభువు దూత పరలోకమునుండి దిగివచ్చి, రాయి పొర్లించి దానిమీద కూర్చుండెను; అప్పుడు మహాభూకంపము కలిగెను. ఆ దూత స్వరూపము మెరుపువలె నుండెను, అతని వస్త్రము హిమమంత తెల్లగా ఉండెను. అతనికి భయపడుటవలన కావలివారు వణకి చచ్చినవారివలె నుండిరి. దూత ఆ స్త్రీలను చూచి – మీరు భయపడకుడి, సిలువ వేయబడిన యేసును మీరు వెదకుచున్నారని నాకు తెలియును; ఆయన ఇక్కడ లేడు; తాను చెప్పినట్టే ఆయన లేచియున్నాడు.

(మత్తయి 28:1–6)

క్రీస్తు లేఖనముల ప్రకారము మూడవ దినమున లేపబడెను. (1 కొరింథీ. 15:4)

నేను దాని మరల తీసికొనునట్లు నా ప్రాణము పెట్టుచున్నాను; ఇందువలననే నా తండ్రి నన్ను ప్రేమించుచున్నాడు. ఎవడును నా ప్రాణము తీసికొనడు; నా అంతట నేనే దాని పెట్టుచున్నాను; దాని పెట్టుటకు నాకు అధికారము కలదు; దాని తిరిగి తీసికొనుటకును నాకు అధికారము కలదు; నా తండ్రి వలన ఈ ఆజ్ఞ పొందితిననెను. (యోహాను 10:17-18)

మరెన్నడును ఉండకుండ మరణమును ఆయన మ్రింగివేయును. ప్రభువైన యెహోవా ప్రతివాని ముఖముమీది బాష్ప బిందువులను తుడిచివేయును. (యెషయా 25:8)

నేను మొదటివాడను కడపటివాడను జీవించువాడను; మృతుడనైతిని గాని ఇదిగో యుగయుగములు సజీవుడనైయున్నాను. మరియు మరణము యొక్కయు పాతాళలోకము యొక్కయు తాళపుచెవులు నా స్వాధీనములో ఉన్నవి. (ప్రకటన 1:18)

ఓ మరణమా, నీ విజయమెక్కడ? ఓ మరణమా నీ ముల్లెక్కడ? అయినను మన ప్రభువైన యేసుక్రీస్తు మూలముగా మనకు జయము అనుగ్రహించుచున్న దేవునికి స్తోత్రము కలుగును గాక!.
(1 కొరింథీ 15: 55,57).

# యేసు ఆరోహణము తరువాత మరల కనిపించుట

ఆదివారము తెల్లవారినప్పుడు యేసు లేచి, తాను ఏడు దయ్యములను వెళ్లగొట్టిన మగ్దలేనే మరియకు మొదట కనబడెను. ఆయనతో ఉండినవారు దు:ఖపడి యేడ్చుచుండగా ఆమె వెళ్లి ఆ సంగతి వారికి తెలియజేసెను గాని, ఆయన బ్రదికియున్నాడనియు ఆమెకు కనబడెననియు వారు విని నమ్మకపోయిరి.

ఆ తరువాత వారిలో ఇద్దరు ఒక పల్లెటూరికి నడిచిపోవుచుండగా, ఆయన మారురూపము గలవాడై వారికి ప్రత్యక్షమాయెను. (మార్కు 16:9-12)

ఆదివారము సాయంకాలమున శిష్యులు యూదులకు భయపడి, తాము కూడియున్న యింటి తలుపులు మూసికొనియుండగా యేసు వచ్చి మధ్యను నిలిచి - మీకు సమాధానము కలుగునుగాక అని వారితో చెప్పెను. ఆయన ఆలాగు చెప్పి వారికి తన చేతులను ప్రక్కను చూపగా శిష్యులు ప్రభువును చూచి సంతోషించిరి.
(యోహాను 20:19-20)

ఆయన కేఫాకును, తరువాత పండ్రెండుగురికిని కనబడెను. అటుపిమ్మట ఐదువందలకు ఎక్కువైన సహోదరులకు ఒక్కసమయమందే కనబడెను. వీరిలో అనేకులు ఇప్పటివరకు నిలిచియున్నారు, కొందరు నిద్రించిరి. తరువాత ఆయన యాకోబుకును, అటుతరువాత అపొస్తలులకందరికిని కనబడెను.

(1 కొరింథీ 15:5-7)

అప్పుడు యేసు - మరల మీకు సమాధానము కలుగునుగాక, తండ్రి నన్ను పంపిన ప్రకారము నేనును మిమ్మును పంపుచున్నానని వారితో చెప్పెను. ఆయన ఈ మాట చెప్పి వారిమీద ఊది - పరిశుద్ధాత్మను పొందుడి. (యోహాను 20: 21-22)

అయితే యేసు వారియొద్దకు వచ్చి - పరలోకమందును భూమిమీదను నాకు సర్వాధికారము ఇయ్యబడియున్నది. కాబట్టి మీరు వెళ్లి, సమస్త జనులను శిష్యులనుగా చేయుడి; తండ్రియొక్కయు కుమారునియొక్కయు పరిశుద్ధాత్మయొక్కయు నామములోనికి వారికి బాప్తిస్మమిచ్చుచు, నేను మీకు ఏ యే సంగతులను ఆజ్ఞాపించితినో వాటినన్నిటినిగైకొనవలెనని వారికి బోధించుడి. ఇదిగో నేను యుగసమాప్తి వరకు సదాకాలము మీతో కూడ ఉన్నానని వారితో చెప్పెను. (మత్తయి 28:18-20)

అయినను పరిశుద్ధాత్మ మీ మీదికి వచ్చునప్పుడు మీరు శక్తినొందెదరు గనుక మీరు యెరూషలేములోను, యూదయ సమరయ దేశములయందంతటను భూదిగంతముల వరకును, నాకు సాక్షులైయుందురని వారితో చెప్పి, వారు చూచుచుండగా ఆయన ఆరోహణమాయెను.

(అ.కా. 1: 8-10)

# యేసు వాగ్దానం ప్రకారం పరిశుద్ధాత్మ దిగివచ్చుట

నేను తండ్రిని వేడుకొందును, మీయొద్ద ఎల్లప్పుడు నుండుటకై ఆయన వేరొక ఆదరణకర్తను, అనగా సత్యస్వరూపియగు ఆత్మను మీకనుగ్రహించును. లోకము ఆయనను చూడదు, ఆయనను ఎరుగదు గనుక ఆయనను పొందనేరదు; మీరు ఆయనను ఎరుగుదురు. ఆయన మీతో కూడ నివసించును, మీలో ఉండును. మిమ్మును అనాథలనుగా విడువను, మీ యొద్దకు వత్తును. కొంతకాలమైన తరువాత లోకము నన్ను మరి ఎన్నడును చూడదు. (యోహాను 14:16-18)

పెంతెకొస్తను పండుగదినము వచ్చినప్పుడు అందరు ఒకచోట కూడియుండిరి. అప్పుడు వేగముగా వీచు బలమైన గాలివంటి యొకధ్వని ఆకాశమునుండి అకస్మాత్తుగా, వారు కూర్చుండియున్న యిల్లంతయు నిండెను. మరియు అగ్నిజ్వాలలవంటి నాలుకలు విభాగింపబడినట్టుగా వారికి కనబడి, వారిలో ఒక్కొక్కని మీద వ్రాలగా అందరు పరిశుద్ధాత్మతో నిండిన వారై ఆ ఆత్మ వారికి వాక్శక్తి అనుగ్రహించినకొలది అన్యభాషలతో మాటలాడసాగిరి.

(అ.కా. 2:1-4)

నాయందు నిలిచియుండుడి, మీయందు నేనును నిలిచియుందును. తీగె ద్రాక్షావల్లిలో నిలిచియుంటేనేగాని తనంతట తానే యేలాగు ఫలింపదో, ఆలాగే నాయందు నిలిచియుంటేనే కాని మీరును ఫలింపరు. ద్రాక్షావల్లిని నేను తీగెలు మీరు. ఎవడు నాయందు నిలిచియుండునో నేను ఎవనియందు నిలిచియుందునో వాడు బహుగా ఫలించును; నాకు వేరుగా ఉండి మీరేమియు చేయలేరు.

(యోహాను 15:4-5)

ఆయన ఆజ్ఞలను గైకొనువాడు ఆయనయందు నిలిచియుండును, ఆయన వానియందు నిలిచియుండును; ఆయన మనయందు నిలిచియున్నాడని ఆయన మనకనుగ్రహించిన ఆత్మమూలముగా తెలిసికొనుచున్నాము.

(1 యోహాను 3:24)

నేను క్రీస్తుతోకూడ సిలువవేయబడియున్నాను; ఇకను జీవించువాడను నేను కాను, క్రీస్తే నాయందు జీవించుచున్నాడు. నే నిప్పుడు శరీరమందు జీవించుచున్న జీవితము నన్ను ప్రేమించి, నా కొరకు తన్నుతాను అప్పగించుకొనిన దేవుని కుమారునియందలి విశ్వాసమువలన జీవించుచున్నాను.

(గలతీ 2:20)

# యేసు క్రీస్తు మహిమపరచుట

దూతల కంటె కొంచెము తక్కువవాడుగా చేయబడిన యేసు మరణము పొందినందున, మహిమాప్రభావములతో కిరీటము ధరించిన వానిగా ఆయనను చూచుచున్నాము.

(హెబ్రీ 2:9)

ఆయన మహాత్మ్యమును మేము కన్నులారా చూచినవారమై తెలిపితిమి. ఈయన నా ప్రియకుమారుడు ఈయన యందు నేను ఆనందించుచున్నాను అను శబ్దము మహాదివ్యమహిమ నుండి ఆయన యొద్దకు వచ్చినప్పుడు, తండ్రియైన దేవునివలన ఘనతయు మహిమయు ఆయన పొందగా మేము ఆ పరిశుద్ధ పర్వతముమీద ఆయనతోకూడ ఉండినవారమై, ఆ శబ్దము ఆకాశమునుండి రాగా వింటిమి.

(2 పేతురు 1:17-18)

ఏడు సువర్ణ దీపస్తంభ ములను, ఆ దీపస్తంభములమధ్యను మనుష్యకుమారునిపోలిన యొకనిని చూచితిని. ఆయన తన పాదములమట్టునకు దిగుచున్న వస్త్రము ధరించుకొని రొమ్మునకు బంగారుదట్టి కట్టుకొనియుండెను. ఆయన తలయు తలవెంట్రుకలును తెల్లని ఉన్నిని పోలినవై హిమమంత ధవళముగా ఉండెను. ఆయన నేత్రములు అగ్ని జ్వాలవలె ఉండెను; ఆయన పాదములు కొలిమిలో పుటమువేయబడి మెరయుచున్న అపరంజితో సమానమై యుండెను; ఆయన కంఠస్వరము విస్తార జలప్రవాహముల ధ్వనివలె ఉండెను. (ప్రకటన 1: 13-15)

అయినను మొదట నీ కుండిన ప్రేమను నీవు వదలితివని నేను నీమీద తప్పు ఒకటి మోపవలసి యున్నది. నీవు ఏ స్థితిలోనుండి పడితివో అది జ్ఞాపకము చేసికొని మారుమనస్సుపొంది ఆ మొదటి క్రియలను చేయుము. అట్లుచేసి నీవు మారుమనస్సు పొందితేనే సరి; లేని యెడల నేను నీయొద్దకు వచ్చి నీ దీపస్తంభమును దాని చోటనుండి తీసివేతును. (ప్రకటన 2:4-5)

నీ క్రియలను నేనెరుగుదును; నీకున్న శక్తి కొంచెమై యుండినను నీవు నా వాక్యమును గైకొని నా నామము ఎరుగననలేదు. ఇదిగో తలుపు నీయెదుట తీసియుంచి యున్నాను; దానిని ఎవడును వేయనేరడు.

(ప్రకటన 3;8)

నీ క్రియలను నేనెరుగుదును, నీవు చల్లగానైనను వెచ్చగానైనను లేవు; నీవు చల్లగానైనను వెచ్చగానైనను ఉండిన మేలు. నీవు వెచ్చగానైనను చల్లగానైనను ఉండక, నులి వెచ్చనగా ఉన్నావు గనుక నేను నిన్ను నా నోటనుండి ఉమ్మివేయ నుద్దేశించుచున్నాను. (ప్రకటన 3: 15-16)

నేను ప్రేమించు వారందరిని గద్దించి శిక్షించుచున్నాను గనుక నీవు ఆసక్తి గలిగి మారుమనస్సు పొందుము. నేను జయించి నా తండ్రితోకూడ ఆయన సింహాసనమునందు కూర్చుండియున్న ప్రకారము జయించువానిని నాతోకూడ నా సింహాసనము నందు కూర్చుండనిచ్చెదను. (ప్రకటన 3: 19,21)

ఈయనయైతే పాపముల నిమిత్తమై సదాకాలము నిలుచు ఒక్క బలిని అర్పించి, అప్పటినుండి తన శత్రువులు తన పాదములకు పాదపీఠముగా చేయబడువరకు కనిపెట్టుచు దేవుని కుడిపార్శ్వమున ఆసీనుడాయెను.

(హెబ్రీ 10: 12,13)

ఆకాశమండలముగుండ వెళ్లిన దేవుని కుమారుడైన యేసు అను గొప్ప ప్రధానయాజకుడు మనకు ఉన్నాడు గనుక మనము ఒప్పుకొనినదానిని గట్టిగా చేపట్టుదము. మన ప్రధానయాజకుడు మన బలహీనతలయందు మనతో సహానుభవము లేనివాడు కాడు గాని, సమస్త విషయములలోను మనవలెనే శోధింపబడినను, ఆయన పాపము లేనివాడుగా ఉండెను. గనుక మనము కనికరింపబడి సమయోచితమైన సహాయముకొరకు కృప పొందునట్లు ధైర్యముతో కృపాసనమునొద్దకు చేరుదము.

(హెబ్రీ 4: 14-16)

ఈయన నిరంతరము ఉన్నవాడు గనుక మార్పులేని యాజకత్వము కలిగిన వాడాయెను. ఈయన తనద్వారా దేవునియొద్దకు వచ్చువారి పక్షమున, విజ్ఞాపనము చేయుటకు నిరంతరము జీవించుచున్నాడు.

(హెబ్రీ 7: 24-25)

-నిన్ను ఏమాత్రమును విడువను, నిన్ను ఎన్నడును ఎడబాయను అని ఆయనయే చెప్పెను గదా. కాబట్టి - ప్రభువు నాకు సహాయుడు, నేను భయపడను, నరమాత్రుడు నాకేమి చేయగలడు? అని మంచి ధైర్యముతో చెప్పగలవారమై యున్నాము. (హెబ్రీ 13:5,6)

## తిరిగివస్తానని యేసు వాగ్దానము చేయుట

నేను వెళ్లి స్థలము సిద్ధపరచినయెడల నేనుండు స్థలములో మీరును ఉండులాగున మరల వచ్చి నాయొద్ద నుండుటకు మిమ్మును తీసికొని పోవుదును.

(యోహాను 14:3)

ఆర్భాటముతోను, ప్రధానదూతశబ్దముతోను, దేవుని బూరతోను పరలోకమునుండి ప్రభువు దిగివచ్చును; క్రీస్తునందుండి మృతులైనవారు మొదట లేతురు. ఆ మీదట సజీవులమై నిలిచి యుండు మనము వారితో కూడ ఏకముగా ప్రభువును ఎదుర్కొనుటకు ఆకాశమండలమునకు మేఘములమీద కొనిపోబడుదుము. కాగా మనము సదాకాలము ప్రభువుతో కూడ ఉందుము.

(1 థెస్స 4: 16–17)

మనుష్యకుమారుడు తన తండ్రి మహిమ గలవాడై తన దూతలతో కూడ రాబోవుచున్నాడు. అప్పుడాయన ఎవని క్రియల చొప్పున వానికి ఫలమిచ్చును. (మత్తయి 16:27)

# యేసు క్రీస్తు లోకమునకు తీర్పు తీర్చును

ఇప్పుడైతే అంతటను అందరును మారుమనస్సు పొందవలెనని మనుష్యులకు ఆజ్ఞాపించు చున్నాడు. ఎందుకనగా తాను నియమించిన మనుష్యుని చేత నీతి ననుసరించి భూలోకమునకు తీర్పు తీర్చబోయెడి యొకదినమును నిర్ణయించియున్నాడు. మృతులలో నుండి ఆయనను లేపినందున దీని నమ్ముటకు ఆధారము కలుగజేసియున్నాడు. (అపొ.కా. 17:30–31)

ఆ దినమందు అనేకులు నన్నుచూచి ప్రభువా, ప్రభువా, మేము నీ నామమున ప్రవచింపలేదా? నీ నామమున దయ్యములను వెళ్లగొట్టలేదా? నీ నామమున అనేకమైన అద్భుతములు చేయలేదా? అని చెప్పుదురు. అప్పుడు – నేను మిమ్మును ఎన్నడును ఎరుగను; అక్రమము చేయువారలారా, నా యొద్ద నుండి పొండని వారితో చెప్పుదును. (మత్తయి 7:22–23)

మనలో ప్రతివాడును తన్ను గురించి దేవునికి లెక్క యొప్పగింపవలెను. (రోమా 14:12)

అందుచేతను పరలోకమందున్న వారిలో గాని, భూమి మీద ఉన్న వారిలో గాని, భూమి క్రింద ఉన్న వారిలోగాని, ప్రతివాని మోకాలును యేసు నామమున వంగునట్లును, ప్రతివాని నాలుకయు తండ్రియైన దేవుని మహిమార్థమై యేసుక్రీస్తు ప్రభువని ఒప్పుకొనునట్లును, దేవుడు ఆయనను అధికముగా హెచ్చించి, ప్రతి నామమునకు పై నామమును ఆయనకు అనుగ్రహించెను.
(ఫిలిప్పీ 2:9,10)

రాత్రి కలిగిన దర్శనములను నేనింక చూచుచుండగా, ఆకాశ మేఘారూఢుడై మనుష్య కుమారుని పోలిన యొకడు వచ్చి, ఆ మహావృద్ధుడగు వాని సన్నిధిని ప్రవేశించి, ఆయన సముఖమునకు తేబడెను. సకల జనులును రాష్ట్రములును ఆయాభాషలు మాటలాడువారును ఆయనను సేవించునట్లు ప్రభుత్వమును మహిమయు ఆధిపత్యమును ఆయన కీయబడెను. ఆయన ప్రభుత్వము శాశ్వతమైనది అదెన్నటికిని తొలగిపోదు, ఆయన రాజ్యము ఎప్పుడును లయము కాదు.
(దానియేలు 7:13,14)

ఏడవ దూత బూర ఊదినప్పుడు పరలోకములో గొప్ప శబ్దములు పుట్టెను. ఆ శబ్దములు–ఈలోక రాజ్యము మన ప్రభువు రాజ్యమును ఆయన క్రీస్తురాజ్యము నాయెను. ఆయన యుగ యుగముల వరకు ఏలుననెను.
(ప్రకటన 11:15)

# నీవు యేసు యొద్దకు రావాలని ఆయన కోరుకుంటున్నాడు

ప్రయాసపడి భారము మోసికొనుచున్న సమస్త జనులారా, నాయొద్దకు రండి, నేను మీకు విశ్రాంతి కలుగజేతును. నేను సాత్వికుడను దీనమనస్సు గలవాడను గనుక మీమీద నాకాడి ఎత్తికొని నాయొద్ద నేర్చుకొనుడి. అప్పుడు మీ ప్రాణములకు విశ్రాంతి దొరకును.

(మత్తయి 11:28,29)

ఇదిగో నేను తలుపునొద్ద నిలుచుండి తట్టుచున్నాను. ఎవడైనను నా స్వరము విని తలుపు తీసిన యెడల, నేను అతని యొద్దకు వచ్చి అతనితో నేనును, నాతో కూడ అతడును భోజనము చేయుదుము. (ప్రకటన 3:20)

తండ్రి నాకు అనుగ్రహించు వారందరును నా యొద్దకు వత్తురు. నా యొద్దకు వచ్చువానిని నేనెంతమాత్రమును బయటికి త్రోసివేయను. (యోహాను 6:37)

దప్పిగొనిన వానిని రానిమ్ము, ఇచ్ఛయించువానిని జీవ జలమును ఉచితముగా పుచ్చుకొననిమ్ము.

(ప్రకటన 22:17)

## నీవు యేసుతో ఏమి చేయగలవు ?

కుమారుని యందు విశ్వాసముంచువాడే నిత్యజీవముగలవాడు. కుమారునికి విధేయుడు కానివాడు జీవము చూడడుగాని దేవుని ఉగ్రత వాని మీద నిలిచియుండును. (యోహాను 3:36)

తన్ను ఎందరంగీకరించిరో వారికందరికి, అనగా తన నామమునందు విశ్వాసముంచినవారికి, దేవుని పిల్లలగుటకు ఆయన అధికారము అనుగ్రహించెను (యోహాను 1:12)

అందుచేత సమస్త కల్మషమును, విస్రవీగుచున్న దుష్టత్వమును మాని, లోపల నాటబడి మీ ఆత్మలను రక్షించుటకు శక్తిగల వాక్యమును సాత్వీకముతో అంగీకరించుడి. (యాకోబు 12:1)

దేవుడు మృతులలోనుండి ఆయనను లేపెనని నీ హృదయమందు విశ్వసించినయెడల నీవు రక్షింపబడుదువు. ఏలయనగా నీతి కలుగునట్లు మనుష్యుడు హృదయములో విశ్వసించును, రక్షణకలుగునట్లు నోటితో ఒప్పుకొనును. (రోమా10:9-10)

### మాదిరికరమైన ప్రార్థన

ప్రియమైన యేసుప్రభువా! నా పాపములు తీసివేయుటకు నీవు కల్వరి సిలువలో చనిపోయినందుకు వందనాలు. నేను చేసిన తప్పులను బట్టి క్షమాపణ అడుగుచున్నాను. ఇప్పుడే నా హృదయములోనికి మిమ్మును రక్షకునిగా ప్రభువుగా స్వీకరిస్తున్నాను. నన్ను నీ యొక్క బిడ్డగా చేసియున్నావని విశ్వసించుచున్నాను. నీకొరకు జీవించుటకు కావలసిన శక్తిని అనుదినము మీరు దయచేయుదురని నమ్ముచున్నాను. యేసు నామములో ప్రార్థించుచున్నాము తండ్రీ! ఆమెన్!!

